

రాయలసీమ దరువు

APTEL/26/A7874

www.rayalaseemadaruvu.com

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

నూతనంగా వెలువడుతున్న 'రాయలసీమ దరువు' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను.

చట్టాలపై అవగాహన ఉండి రాజకీయ విశ్లేషణ, సమస్యల పట్ల అవగాహన, వినూత్న శైలిలో వార్తలు రాయగలిగే వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

సంప్రదించండి

94940 39030
85010 70080

ప్రచురణ : శ్రీ సత్యసాయి /అనంతపురం | ఎడిటర్ : ఎనుముల కుల్లాయప్ప | శనివారం 21 నవంబర్ 2026 | సంపుటి : 01, సంచిక : 57 | పేజీలు : 04, వెల రూ.2

తీరం దాటిన 'అక్వాన్' తుపాను.. ఒడిశా, ఉత్తరాంధ్రలో భారీ వర్షాలు



తీరం దాటే సమయంలో గంటకు 70 నుంచి 90 కిలోమీటర్ల వేగంతో వీచిన గాలులు

శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో భారీగా 168.75 మి.మీ వర్షపాతం నమోదు

ముందస్తు చర్యల్లో భాగంగా పలు రైళ్లు రద్దు చేసిన ఈస్ట్ కోస్ట్ రైల్వే

అమరావతి : బంగాళాఖాతంలో ఏర్పడిన 'అక్వాన్' తుపాను తీరం దాటింది. ఒడిశాలోని గోపాల్‌పూర్ సమీపంలో ఈ ఉదయం 7.30 నుంచి

సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ సెటైర్లు.. ఢిల్లీ పర్యటనలు, బ్యాగుల వ్యవహారంపై తీవ్ర విమర్శలు



తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు.

ఢిల్లీ పర్యటనలు, బ్యాగుల వ్యవహారాన్ని ప్రస్తావిస్తూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

ఓటుకు నోటు కేసును ప్రస్తావిస్తూ గతంలో జరిగిన పరిణామాలను గుర్తుచేశారు.

హైదరాబాద్, నవంబరు 20: సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. ఢిల్లీకి సంచులు మోసుకెళ్లే విషయంలో రేవంత్ రెడ్డికి పదికి పది మార్కులు వేయొచ్చంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ఢిల్లీ పర్యటనల సంఖ్య, బ్యాగుల వ్యవహారాన్ని ప్రస్తావిస్తూ సెటైర్లు వేశారు.

రొమ్ము క్యాన్సర్ గుర్తింపునకు ఏపీకి 750 ఐబ్రెస్ట్ పరికరాలు



- మహిళల్లో రొమ్ము క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది.
- రొమ్ములో కణుతులు, అసాధారణ మార్పులను గుర్తించేందుకు సెన్సార్ల ఆధారంగా పనిచేసే అత్యాధునిక ఐబ్రెస్ట్ పరికరాలను అందుబాటులోకి తీసుకురానుంది.

ఏపీఎండీసీని అత్యున్నత స్థాయి మైనింగ్ సంస్థగా తీర్చిదిద్దాలి

- గనుల శాఖపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు.
- రాష్ట్రంలో కొత్త ఖనిజ నిక్షేపాల గుర్తింపు, వాటి సమర్థ వినియోగం, ఆదాయార్జన అవకాశాలపై చర్చించారు.
- స్టాక్ మార్కెట్‌లోకి ఏపీఎండీసీ - ఐపీవో ప్రక్రియకు సీఎం చంద్రబాబు ఆదేశం



రాష్ట్ర ఖనిజ సంపదను భవిష్యత్ తరాలకు విలువైన ఆస్తిగా మలచడమే లక్ష్యంగా ముందుకు సాగాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఏపీఎండీసీని ఎన్ ఎండీసీ తరహాలో అత్యున్నత స్థాయి మైనింగ్ సంస్థగా తీర్చిదిద్దాలని దిశానిర్దేశం చేశారు. ప్రైవేట్ ఏజెన్సీల సహకారం తీసుకోవాలని సూచించారు. ఖనిజ వనరులను కేవలం ఆదాయార్జనకు పరిమితం చేయకుండా వాటి విలువను పెంచి రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి వినియోగించాలని స్పష్టం చేశారు. డిసెంబర్ నాటికి ఐపీఓ : గనుల శాఖపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. మిగతా..2లో

ఏపీ నుంచి అరుణాచలానికి కార్తిగై దీపం ప్రత్యేక ఎక్స్‌ప్రెస్



- అరుణాచలం కార్తిగై దీపం వేడుకలకు రైల్వే శాఖ ప్రత్యేక రైళ్ల ప్రకటన
- విశాఖపట్నం-తిరువణ్ణామలై మధ్య స్పెషల్ ఎక్స్‌ప్రెస్ సర్వీస్
- నవంబరు 22న విశాఖలో, నవంబరు 23న తిరువణ్ణామలైలో బయలుదేరనున్న ప్రత్యేక రైలు
- ఏపీలోని విజయవాడ, రాజమండ్రి, తిరుపతి సహా పలు ప్రధాన స్టేషన్లలో హాల్ట్‌లు
- తిరుపతి-విశాఖపట్నం మధ్య ప్రత్యేక రైళ్లు నడపాలని రైల్వే నిర్ణయం

విమానాశ్రయ ప్రాజెక్ట్.. ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు!

- తమిళనాడులో ప్రతిపాదిత పరందూర్ గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయ ప్రాజెక్టు మరోసారి న్యాయపరమైన చర్చకు కేంద్రబిందువైంది.
- ఈ ప్రాజెక్టును నిలిపివేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ సాఫ్ట్‌వేర్ కన్సల్టెంట్, పుస్తక ప్రచురణకర్త జి.గౌతమన్ దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై మద్రాస్ హైకోర్టు కీలకంగా స్పందించింది.



ఢిల్లీ : ప్రభుత్వ నిర్ణయానికి సంబంధించిన వివరాలను సమర్పించాలని కోరుతూ తమిళనాడు ప్రభుత్వంతో పాటు సంబంధిత కేంద్ర, రాష్ట్ర సంస్థలకు నోటీసులు జారీ చేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎస్.ఏ.ధర్మాధికారి, జస్టిస్ జి.అరుల్ మురుగన్‌లతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. తమిళనాడు ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాలకు కూడా నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను మిగతా..2లో

ప్రజల నాడి పట్టుకోవడంలో పూర్తిగా విఫలమైన రాహుల్ గాంధీ



- దేశ ప్రజల నాడి పట్టుకోవడంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ పూర్తిగా విఫలమయ్యారని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి విమర్శించారు.
- గత కొన్నేళ్లుగా కాంగ్రెస్ పార్టీలోని నేతలతోపాటు ఆయన దేశ ప్రతిష్టను దిగజార్చేలా ఒకే ఎజెండాతో మాట్లాడుతున్నారని మండిపడ్డారు.

ఢిల్లీ, నవంబర్ 20: దేశ ప్రజల నాడి పట్టుకోవడంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ పూర్తిగా విఫలమయ్యారని

రేవంత్ రెడ్డి పాలనలో క్రైస్తవులు, దళితులపై దాడులు పెరిగాయి

- హైదరాబాద్‌లో యువతులపై దాడి ఘటనపై కేఏ పాల్ ఆగ్రహం
- మూడు నెలల తర్వాత రేవంత్ సీఎంగా ఉండరంటూ వ్యాఖ్యలు
- బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్‌లతో పాత్తుకు సిద్ధమని వెల్లడి



హైదరాబాద్ : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టిన తర్వాత రాష్ట్రంలో క్రైస్తవులు, దళితులు, చర్చిలపై దాడులు పెరిగిపోయాయని ఆయన ఆరోపించారు. హైదరాబాద్ లో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇటీవల హైదరాబాద్ నగరంలో ఇద్దరు యువతులపై జరిగిన దాడి ఘటనను ప్రస్తావిస్తూ ఆయన పోలీసుల పనితీరును ప్రశ్నించారు. ఈ ఘటన జరిగి 2 నెలలు గడుస్తున్నా పోలీసులు నిందితులపై సరైన చర్యలు ఎందుకు తీసుకోలేదని ఆయన నిలదీశారు. యువతులపై దాడి చేసిన వారు రెండు రోజుల్లో బెయిల్ పై బయటకు వచ్చారని ఆవేదన వ్యాక్తం చేశారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంలో మిగతా..2లో

మహిళలను అవమానిస్తే సహించేది లేదు.. బీఆర్ఎస్ నేతలపై మంత్రి సీతక్క ఆగ్రహం



- నిజామాబాద్ జిల్లా ముప్కాల్‌లో నిర్వహించిన సమావేశం రాజకీయ విమర్శలకు వేదికగా మారింది.
- మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మంత్రి సీతక్క తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

నిజామాబాద్, నవంబరు 20: ముప్కాల్‌లో నిర్వహించిన సమావేశంలో మంత్రి సీతక్క బీఆర్ఎస్ నేతలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తాను మంత్రిగా ఉండటాన్ని బీఆర్ఎస్ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారని, అందుకే తనను లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. తన వెంట పడుతూ వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను కాళ్ల మొక్కించుకునే సంస్కృతికి చెందిన వ్యక్తిని కాదని, ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూ కాళ్లు మొక్కించుకునే వారిని తరిమికొట్టే సంస్కృతి తనదని ఘాటుగా వ్యాఖ్యానించారు.

కేసీఆర్ నా కథలో రావణాసురుడు.. కేటీఆర్ మేనేజ్‌మెంట్ కోటా లీడర్

- మాజీ సీఎం కేసీఆర్‌ను రావణాసురుడితో పోల్చిన సీఎం రేవంత్
- కేటీఆర్ ఒక మేనేజ్‌మెంట్ కోటా నాయకుడని ఘాటు విమర్శ
- తెలంగాణలో తన ప్రధాన రాజకీయ ప్రత్యర్థి కేసీఆరేనని స్పష్టీకరణ
- బీజేపీకి పాత్ర లేదు, కాంగ్రెస్‌కు బీఆర్ఎస్సే ప్రధాన ప్రతిపక్షమన్న సీఎం
- తెలంగాణకు ఫుట్‌బాల్ స్టార్ రొనాల్డోను ఆహ్వానిస్తామని వెల్లడి





హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై, ఆయన కుమారుడు కేటీఆర్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. మాజీ సీఎం కేసీఆర్‌ను తన కథలో 'రావణాసురుడు'గా అభివర్ణించిన రేవంత్, కేటీఆర్‌ను 'మేనేజ్‌మెంట్ కోటా' నాయకుడంటూ కొట్టిపారేశారు. తాజాగా జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో తన ప్రధాన రాజకీయ ప్రత్యర్థి కేసీఆరేనని, కేటీఆర్‌ను తాను అంత సీరియస్‌గా పరిగణించడం లేదని రేవంత్ స్పష్టం చేశారు. "కేటీఆర్ ఒక మేనేజ్‌మెంట్ కోటా నాయకుడు. తండ్రి అండతోనే ఆయన లీడర్ అయ్యారు. బీఆర్ఎస్ పార్టీకి అధ్యక్షుడు కేసీఆర్ కాబట్టి, ఆయన్నే నేను రాజకీయ ప్రత్యర్థిగా భావిస్తాను" అని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు పగటి కలలు కంటున్నారని ఎద్దేవా చేసిన రేవంత్, కాంగ్రెస్ ప్రభుత్వం తలుచుకుంటే మిగతా..2లో

సిద్దిపేటలో నాపై పోటీ చేయండి సీఎం రేవంత్‌రెడ్డికి హరీశ్‌రావు సవాల్



- తనను తిట్టడానికే సిద్దిపేటలో రేవంత్ రెడ్డి సభ పెట్టాలా? అని మాజీమంత్రి హరీశ్‌రావు విమర్శించారు.
- విలేకరుల సమావేశంలో పలు అంశాలపై స్పందించారు.

హైదరాబాద్: తమను(కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు) తిట్టడానికే సిద్దిపేటలో రేవంత్ సభ పెట్టాలా? అని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శలు గుప్పించారు. సొంత పార్టీ ఎమ్మెల్యేలే రేవంత్‌రెడ్డి అవినీతి గురించి మాట్లాడుతున్నారన్న ఆయన తనపై పోటీ చేయాలని సవాల్ విసిరారు. సిద్దిపేటలోనే తేల్చుకుందాం అంటూ గురువారం నిర్వహించిన సీఎం సభ గురించి ఘాటుగా విమర్శనాస్త్రాలు గుప్పించారు. ఈ మేరకు హైదరాబాద్ లోని తెలంగాణ భవన్‌లో

మొదటి పేజీ తరువాయి

రొమ్ము క్యాన్సర్ గుర్తింపునకు ఏపీకి 750 ఐబ్రెస్ట్ పరికరాలు

అమరావతి, నవంబర్20: మహిళల్లో రొమ్ము క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. రొమ్ములో కణుతులు, అసాధారణ మార్పులను గుర్తించేందుకు సెన్సార్ల ఆధారంగా పనిచేసే అత్యాధునిక ఐబ్రెస్ట్ పరికరాలను అందుబాటులోకి తీసుకురానుంది. అందుకోసం రాష్ట్రానికి సుమారు రూ.56 కోట్ల విలువైన 750 పరికరాలు వచ్చినట్లు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. త్వరలో నిర్వహించనున్న నాన్ కమ్యూనికల్ డిసీజెస్ సర్వేలో ఈ పరికరాలను వినియోగించనున్నారని తెలిపారు. దేశంలోనే తొలిసారిగా లక్షలాది మంది మహిళలకు ఈ పరీక్షలను చేపట్టనున్నట్లు వివరించారు. ఇప్పటికే మెడ్‌టెక్ చాలెంజ్ ద్వారా కృత్రిమ మేధ ఆధారిత వైద్య సేవలకు అంతర్జాతీయ గుర్తింపు లభించిందని మంత్రి సత్యకుమార్ గుర్తు చేశారు.

తీరం దాటిన 'అక్వాన్' తుపాను..
ఒడిశా, ఉత్తరాంధ్రలో భారీ వర్షాలు

8.30 గంటల మధ్య తుపాను తీరాన్ని తాకినట్లు వాతావరణ శాఖ అధికారికంగా ధ్రువీకరించింది. తుపాను తీరం దాటే సమయంలో తీర ప్రాంతంలో గంటకు 70 నుంచి 80 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచాయని, అప్పుడప్పుడు వీటి తీవ్రత గరిష్ఠంగా 90 కిలోమీటర్ల వరకు నమోదైందని అధికారులు తెలిపారు. తీరం దాటిన అనంతరం తుపాను ఉత్తర-ఈశాన్య దిశగా ఒడిశా మీదుగా కదులుతోంది. ఇది రాగల మూడు గంటల్లో తీవ్ర వాయుగుండంగా, ఆ తర్వాతి ఆరు గంటల్లో సాధారణ వాయుగుండంగా మరింత బలహీనపడుతుందని వాతావరణ శాఖ వెల్లడించింది. తుపాను ప్రభావంతో ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు దక్షిణ ఒడిశాలో విస్తారంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో అత్యధికంగా 168.75 మి.మీ, అరకభద్రలో 162.50 మి.మీ, కంచిలిలో 148.50 మి.మీ వర్షపాతం నమోదైంది. తుపాను దృష్ట్యా ఈస్ట్ కోస్ట్ రైల్వే ముందుజాగ్రత్తగా పలు రైళ్లను రద్దు చేసింది. ఒడిశా ప్రభుత్వం లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించింది. తుపాను బలహీనపడుతున్నప్పటికీ, ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం తదితర ప్రాంతాల ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది.

కేసీఆర్ నా కథలో రావణాసురుడు..
కేటీఆర్ మేనేజ్‌మెంట్ కోటా లీడర్

ఆ పార్టీని ఎప్పుడో ఖతం చేసేదని, కానీ ప్రతిపక్షంగా ఉండాలనే ఉద్దేశంతోనే దాన్ని కొనసాగనిస్తున్నామని వ్యాఖ్యానించారు. తెలంగాణ రాజకీయాల్లో బీజేపీకి ఎలాంటి ముఖ్య పాత్ర లేదని, కాంగ్రెస్‌కు బీఆర్ఎస్సే ప్రధాన శత్రువని ఆయన పేర్కొన్నారు. బీజేపీ బలంగా ఉన్న రాష్ట్రాల్లో 'ఓట్ల దొంగతనానికి' పాల్పడుతోందని ఆరోపించారు. ఇదే కార్యక్రమంలో, గతంలో ఫుట్‌బాల్ ఆటగాడు మెస్సీ హైదరాబాద్ వచ్చిన విషయాన్ని గుర్తుచేస్తూ, త్వరలో క్రిస్టియానో రొనాల్డోను తెలంగాణకు ఆహ్వానించే ప్రయత్నాలు చేస్తున్నామని వెల్లడించారు. దీంతో పాటు కేంద్ర ప్రభుత్వ అప్పులు, దర్యాప్తు సంస్థల దుర్వినియోగం, లోక్‌సభ సీట్ల పునర్విభజన వంటి అంశాలను ప్రస్తావిస్తూనే, రాష్ట్రంలో జరగనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్' గురించి కూడా మాట్లాడారు.

మహిళలను అవమానిస్తే సహించేది లేదు..
బీఆర్ఎస్ నేతలపై మంత్రి సీతక్క ఆగ్రహం

కరోనా వంటి కష్టకాలంలో సైతం తాను ప్రజల మధ్యే ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశానని గుర్తుచేశారు. ఆ సమయంలో కూడా కొందరు తన సేవలను గుర్తించకుండా హేళన చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల కోసం కష్టపడిన తనపై నేడు రాజకీయ విమర్శలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి చేసిన 'సిగ్గుండాలి' అనే వ్యాఖ్యలపై మంత్రి సీతక్క తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలను కించపరిచేలా మాట్లాడటం ఏ విధమైన రాజకీయ సంస్కారమని ప్రశ్నించారు. మహిళలను అవమానించే వారి వెంట పడి కొట్టిన చరిత్ర తనదని, మహిళల ఆత్మగౌరవం విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. మహిళలను గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, రాజకీయాల్లో విమర్శలు ఉండవచ్చు కానీ వ్యక్తిగతంగా మహిళలను అవమానించే స్థాయికి దిగజారడం సరికాదని హితవు పలికారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తరహా చెప్పే సంస్కారం ఇదేనా? అంటూ బీఆర్ఎస్ నాయకత్వాన్ని నిలదీశారు. మహిళల గౌరవం, ఆత్మగౌరవం గురించి మాట్లాడే సమయంలో రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలని సూచించారు. ముప్కాల్ వేదికగా సీతక్క చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

రేవంత్ రెడ్డి పాలనలో క్రైస్తవులు,
దళితులపై దాడులు పెరిగాయి

యంత్రాంగం విఫలమైందని ఆరోపిస్తూ, ఎవరినీ వదిలిపెట్టేది లేదని, తాట తీస్తానంటూ హెచ్చరించారు. మరోసారి దళితులు, యువతులపై దాడులు జరిగితే తీవ్ర పరిణామాలు ఉంటాయని వ్యాఖ్యానించారు. ఇదే సమయంలో రాష్ట్ర రాజకీయాలపై కేపీ పాల్ పలు వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి మరో 3 నెలల తర్వాత ముఖ్యమంత్రిగా కొనసాగబోరని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్ రాజకీయ కార్యాచరణలో భాగంగా తాము పొత్తులకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం అవసరమైతే బీజేపీ, బీఆర్ఎస్ లేదా కాంగ్రెస్ పార్టీలతోనూ పొత్తు పెట్టుకోవడానికి వెనుకాడబోమని ఆయన స్పష్టం చేశారు.

సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ సెటైర్లు..
ఢిల్లీ పర్యటనలు, బ్యాగుల వ్యవహారంపై తీవ్ర విమర్శలు

2015లో జరిగిన ఓటుకు నోటు కేసును ప్రస్తావించిన కేటీఆర్.. అప్పట్లో ఎమ్మెల్యేకు లంచం ఇవ్వడానికి ప్రయత్నించిన వ్యవహారంలో రేవంత్ రెడ్డి పట్టుబడ్డారని ఆరోపించారు. ఈ కేసుకు సంబంధించి ఫోరెన్సిక్, డాక్యుమెంటరీ ఆధారాలు ఉన్నాయని, ప్రస్తుతం సుప్రీంకోర్టులో విచారణ కొనసాగుతోందని పేర్కొన్నారు. గతంలో బ్యాగులు మోసుకెళ్లే స్థాయి నుంచి ఇప్పుడు ఢిల్లీ వరకు బ్యాగులు తీసుకెళ్లే స్థాయికి ఎదిగారంటూ విమర్శించారు. రాహుల్ గాంధీకి రేవంత్ రెడ్డి ఏటీఎంగా మారారని కూడా ఆరోపించారు.

చెకుముకి రాష్ట్రస్థాయి సంబరాలలో 'అనంత' ప్రతిభ

- మూడో స్థానంలో మురిసిన అనంత విద్యార్థులు
- రాష్ట్రస్థాయి లో రెపరెపలాడిన రాధా స్కూల్ విద్యార్థులు



అనంతపురం, నవంబర్ 20, దరువు న్యూస్ : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలలో అనంతపురం జిల్లా మరో మారు ప్రతిబింబించింది. అనంతపురం రూరల్ ప్రాంతానికి చెందిన రాధా స్కూల్ ఆఫ్ లర్నింగ్ విద్యార్థులు మూడవ స్థానాన్ని కైవసం చేసుకొని తృతీయ బహుమతి గెలిచినట్లు జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వీరరాజు రాష్ట్ర నాయకులు సాకె భాస్కర్ తెలియజేశారు. శుక్రవారం స్కూలుకు వెళ్లి విద్యార్థులను కలిసి అభినందించారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక నాయకులు మాట్లాడుతూ.. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జరిగిన ఈ సైన్స్ సంబరాలకు మన జిల్లా నుండి ప్రభుత్వ పాఠశాలల విభాగంలో నగరంలోని న్యూటన్ హైస్కూల్ విద్యార్థులు, ప్రైవేట్ పాఠశాలల విభాగం నుండి రాధా స్కూల్ ఆఫ్ లర్నింగ్ విద్యార్థులు పాల్గొన్నారని వారు తెలియజేశారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం ప్రభుత్వ,ప్రైవేట్ పాఠశాలలకు సంబంధించిన విద్యార్థుల 56 టీంలు పాల్గొన్నట్లు తెలిపారు. వాటిలో ప్రైవేట్ పాఠశాలల విభాగంలో నిర్వహించిన సైన్స్ సంబరాలలో 28 టీంలు హాజరవ్వగా అందులో జిల్లాకు చెందిన విద్యార్థినిలు ఎ.వర్ష చౌదరి పి.విష్ణుప్రియ ఎ.లాస్య తృతీయ స్థానంలో నిలిచారని వారన్నారు. విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథం పెంపొందించే లక్ష్యంతో ప్రతి సంవత్సరం జిల్లాలో నిర్వహిస్తున్న చెకుముకి సైన్స్ సంబరాలలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని రాష్ట్రస్థాయి బహుమతి గెలవడం చాలా ఆనందదాయకమని ముందు ముందు మరిన్ని సైంటిఫిక్ టెంపర్ కార్యక్రమాలు నిర్వహించడానికి ఇలాంటివి ఎంతో ఉపయోగపడతాయని ఈ సందర్భంగా వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ ఎం శ్రీదేవి, హెచ్.ఎం. వి.జయచంద్ర ఉపాధ్యాయులు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎండీసీని అత్యున్నత స్థాయి మైనింగ్ సంస్థగా తీర్చిదిద్దాలి: సీఎం చంద్రబాబు



రాష్ట్రంలో కొత్త ఖనిజ నిక్షేపాల గుర్తింపు, వాటి సమర్థ వినియోగం, ఆదాయార్జన అవకాశాలపై చర్చించారు. రాష్ట్రంలోని ఖనిజ వనరులు ఇక్కడే వినియోగంలోకి వచ్చేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఖనిజ అన్వేషణ, వేలం ప్రక్రియను వేగవంతం చేసేందుకు వచ్చే ఐదేళ్ల కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలని ఆదేశించారు. ఏపీఎండీసీని స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ చేసేందుకు సీఎం ఆమోదం తెలిపారు. వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి ఐపీఓకు వెళ్లేలా కార్యాచరణ రూపొందించాలన్నారు. సంస్థ ఈక్విటీ విలువ ఆధారంగా ఐపీఓ ప్రక్రియ చేపట్టాలని నిర్దేశించారు. ఈ మేరకు ప్రతిపాదనలను అధికారులు సమర్పించారు. 209 క్లస్టర్లుగా విభజన: ఏపీ రేర్ ఎర్త్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటుకు సీఎం ఆమోదం తెలిపారు. రేర్ ఎర్త్ ఖనిజాల అన్వేషణతో పాటు అదనపు విలువ కల్పించడంపై దృష్టి పెట్టాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఖనిజ నిక్షేపాల గుర్తింపునకు ఆధునిక పద్ధతులు వినియోగిస్తున్నామన్న అధికారులు 74 వేల 860 చదరపు కిలోమీటర్ల పరిధిలో 582 మినరల్ పొటెన్షియల్ ఏరియాలను గుర్తించినట్లు తెలిపారు. వీటిని 209 క్లస్టర్లుగా విభజించినట్లు ముఖ్యమంత్రికి వివరించారు. పెండింగ్‌లోని క్వారీ లీజు దరఖాస్తులు, రెన్యువల్స్ పరిష్కారంపైనా చర్చించారు. 6 వేల 500 క్వారీ లీజు దరఖాస్తులు, 223 రెన్యువల్స్ పెండింగ్‌లో ఉన్నాయి. వీటి పరిష్కారానికి గడువు పొడిగించే ప్రతిపాదనలను అధికారులు పరిశీలనకు తీసుకొచ్చారు. ఈ దరఖాస్తులు, రెన్యువల్స్ పరిష్కారమైతే ప్రభుత్వానికి సుమారు 400 కోట్ల ఆదాయం వచ్చే అవకాశం ఉంది. రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు సరఫరాపైనా ఏపీఎండీసీ దృష్టి పెట్టింది. ఒడిశా, ఝార్ఖండ్‌లోని 3 బొగ్గు బ్లాకుల వేలంలో పాల్గొంటోంది. ఈ మూడు బ్లాకుల్లో కలిపి 1,774.6 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నట్లు ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు.

ఏపీ నుంచి అరుణాచలానికి కార్తిగై దీపం ప్రత్యేక ఎక్స్‌ప్రెస్

మొదటి పేజీ తరువాయి

అమరావతి : కార్తిగై దీపం మహోత్సవాల వేళ అరుణాచలం వెళ్లే యాత్రికులకు రైల్వే శాఖ ఊరటనిచ్చింది. తమిళనాడులోని తిరువణ్ణామలైలో జరిగే ఈ దీపోత్సవానికి ఆంధ్రప్రదేశ్ నుంచి భారీగా తరలివెళ్లే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లను పట్టాలెక్కిస్తోంది. విశాఖపట్నం నుంచి తిరువణ్ణామలై మార్గంతో పాటు తిరుపతి-విశాఖ మధ్య కూడా ప్రత్యేక సర్వీసులను నడపనున్నట్లు అధికారులు వెల్లడించారు. విశాఖపట్నం-తిరువణ్ణామలై స్పెషల్ ట్రైన్ (నంబర్ 08579) నవంబరు 22న ఆదివారం రాత్రి 11.50 గంటలకు విశాఖలో బయలుదేరి, మరుసటి రోజు సాయంత్రం 5.50 గంటలకు తిరువణ్ణామలై చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు (నంబర్ 08580) నవంబరు 23న సోమవారం రాత్రి 9 గంటలకు తిరువణ్ణామలైలో బయల్దేరి, నవంబరు 24 మధ్యాహ్నం 2 గంటలకు విశాఖ చేరుకుంటుంది. ఈ సర్వీసుకు దువ్వాడ, అనకాపల్లి, సామర్లకోట, రాజమండ్రి, తాడేపల్లిగూడెం, ఏలూరు, విజయవాడ, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, తిరుపతి, చిత్తూరు, కాట్పాడి స్టేషన్లలో హాల్ట్‌లు కల్పించారు. మరోవైపు తిరుపతి-విశాఖపట్నం మధ్య కూడా ప్రత్యేక రైళ్లను ప్రకటించారు. తిరుపతి-విశాఖ స్పెషల్ (నంబర్ 07423) నవంబరు 21న శనివారం రాత్రి 9.50 గంటలకు బయలుదేరి, ఆదివారం మధ్యాహ్నం 1.30 గంటలకు విశాఖ చేరుకుంటుంది. ఇది రేణిగుంట, శ్రీకాళహస్తి, నెల్లూరు, విజయవాడ, గుడివాడ, భీమవరం టౌన్, రాజమండ్రి, అన్నవరం మీదుగా ప్రయాణిస్తుంది. ఇక తిరుగు ప్రయాణంలో విశాఖ-తిరుపతి రైలు (నంబర్ 07424) నవంబరు 24 రాత్రి 11 గంటలకు విశాఖలో బయలుదేరి, మరుసటి రోజు మధ్యాహ్నం 12.30 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. ఈ రైలుకు న్యూ గుంటూరు, తాడేపల్లిగూడెం, ఏలూరు మార్గాల్లో స్టాప్‌లు ఇచ్చారు. ఈ రైళ్లలో 4 జనరల్, 8 స్లీపర్, 6 థర్డ్ ఏసీ, 2 సెకండ్ ఏసీ కోచ్‌లు అందుబాటులో ఉంటాయి. అయితే తిరుపతి-విశాఖ మధ్య తిరిగే ప్రత్యేక రైళ్లలో సాధారణ ఛార్జీల కంటే 1.3 రెట్లు అధికంగా ఉంటాయని అధికారులు స్పష్టం చేశారు.



సిద్దిపేటలో నాపై పోటీ చేయండి - సీఎం రేవంత్‌రెడ్డికి హరీశ్‌రావు

మొదటి పేజీ తరువాయి

నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

సొంత ఎమ్మెల్యేలే విమర్శిస్తున్నారు

నిన్న రేవంత్‌రెడ్డి ముఖంలో తీవ్ర నిరాశ, అసహనం కనిపించాయన్న హరీశ్‌రావు ఇది కాలం తెచ్చిన కరవు కాదని కాంగ్రెస్ తెచ్చిన కరవు ధ్వజమెత్తారు. వెయ్యి టీఎంసీల నీళ్లను కిందకు వదిలిపెట్టి తెలంగాణను కరవులోకి నెట్టారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి పాలన సరిగా లేదని సొంత పార్టీ ఎమ్మెల్యే కోమటి రెడ్డి రాజగోపాల్‌రెడ్డే అంటున్నారని గుర్తుచేశారు. తెలంగాణ ఉద్యమంలో కూడా రేవంత్‌రెడ్డి ద్రోహం చేశారన్న ఆయన, ఉద్యమకారులపైకి తుపాకి పట్టుకుని బయల్దేరిన వ్యక్తి అని దుయ్యబట్టారు.

రేవంత్ రెడ్డికి ఆస్కార్ ఇవ్వొచ్చు

కృష్ణా జలాలను పక్క రాష్ట్రం ఆంధ్రా తీసుకెళ్తుంటే ఏం చేస్తున్నారని ప్రభుత్వాన్ని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఏనాడైనా ఆంధ్రాకు కృష్ణా జలాలు పోవడానికి కారణం కాంగ్రెస్ పార్టీనే అని ధ్వజమెత్తిన ఆయన అబద్ధాలు చెప్పడంలో రేవంత్‌రెడ్డికి ఆస్కార్ ఇవ్వొచ్చని ఎద్దేవా చేశారు. పోతిరెడ్డిపాడు ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ 40 రోజులు అసెంబ్లీని స్తంభింపజేశామన్న హరీశ్‌రావు దానికి సంబంధించిన జీవో వచ్చినప్పుడు తాము వైఎస్ కేబినెట్ లో మంత్రులుగా లేమని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పాలనలోనే పోతిరెడ్డిపాడు ప్రాజెక్టు మొదలైనట్లు గుర్తుచేశారు. ఏపీ సీఎం చంద్రబాబుకు గురుదక్షిణ కింద వెయ్యి టీఎంసీలు ఏపీకి సీఎం రేవంత్ రెడ్డి వదిలినట్లు ఆరోపించారు. సీఎం నిన్న సభలో చెప్పిన 299 టీఎంసీల ఒప్పందం అనేది తాత్కాలికమేనని అన్నారు. "బీఆర్ ఎస్ నుంచి నేను పోటీ చేస్తా. కాంగ్రెస్ నుంచి నువ్వు పోటీ చేయ్. సిద్దిపేటకు రా. రేవంత్ రెడ్డికి భయం. అందుకే ఈ డైవర్షన్ పాలిటిక్స్. ప్రభుత్వ ఖర్చులతో మీటింగ్ పెట్టి తిట్ల దండకం చెప్పారు. నీ సొంత పార్టీ ఎమ్మెల్యేలే నిన్ను చిదరించుకుంటున్నారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఈరోజు కూడా మాట్లాడారు. వాళ్లు నిజాలు చెబితే పిచ్చికుక్కలు అని సొంత పార్టీ ఎమ్మెల్యేలనే సీఎం అంటున్నాడు. అసలు ఆ ఎమ్మెల్యేలు లేకపోతే నీకు ఆ ముఖ్యమంత్రి పదవి ఉంటుందా" -హరీశ్ రావు, మాజీ మంత్రి, బీఆర్ ఎస్ పార్టీ డీప్యూటీ ఫ్లోర్ లీడర్



ఆంధ్రాకు ధారాదత్తం చేసిన ద్రోహి రేవంత్‌రెడ్డి

తెలంగాణ సాగునీటి హక్కులను ఆంధ్రాకు ధారాదత్తం చేసిన ద్రోహి రేవంత్‌రెడ్డి అని హరీశ్‌రావు తీవ్రంగా కోపోద్రిక్తులయ్యారు. కేసీఆర్ పేరు, తన పేరు, కేటీఆర్ పేరు పదేపదే జపించారని, తమ పేర్లు సుమారు 140 సార్లు తలుచుకున్నారని ఎద్దేవా చేశారు. అన్నీ అబద్ధాలు తప్ప ప్రజలకు పనికొచ్చే ఒక్క మాట కూడా మాట్లాడలేదని తెలిపారు. తెలంగాణలో ప్రజలు బీఆర్ఎస్‌ను ఎప్పుడు అధికారంలోకి తెచ్చుకుందామా అని చూస్తున్నారని చెప్పిన ఆయన సిద్దిపేటలో తనపై రేవంత్ రెడ్డి పోటీ చేయాలన్నారు.

విమానాశ్రయ ప్రాజెక్ట్.. ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు!

మొదటి పేజీ తరువాయి

నాలుగు వారాల తర్వాత చేపట్టనున్నట్లు వెల్లడించింది. ఈ వ్యవహారంలో కీలకమైన అంశం ఏమిటంటే.. ఇప్పటికే భూసేకరణ, సాధ్యాసాధ్యాల అధ్యయనాలు, పరిపాలనా అనుమతుల దశలను దాటిన భారీ ప్రాజెక్టును ప్రభుత్వం మధ్యలోనే నిలిపివేయడంపై న్యాయస్థానంలో ప్రశ్నలు తలెత్తడం. 'ఇప్పటికే వందల ఎకరాల భూమిని సేకరించి, పరిహారం చెల్లించిన తర్వాత ప్రాజెక్టును మధ్యలో ఎలా వదిలేస్తారు? ప్రజాధనాన్ని వృథా చేయడానికి వీల్లేదు' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ప్రభుత్వాల ఇష్టాయిష్టాలకు అనుగుణంగా విమానాశ్రయాల నిర్మాణం జరగదని స్పష్టం చేసింది.

ప్రభుత్వ నిర్ణయంపై అభ్యంతరాలు

చెన్నైకి రెండో అంతర్జాతీయ విమానాశ్రయంగా పరందూర్ ప్రాజెక్టును అభివృద్ధి చేయాలని గతంలో తమిళనాడు ప్రభుత్వం ప్రతిపాదించింది. ఇందుకోసం 2023 అక్టోబర్ 31న జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వుల ద్వారా కాంచీపురం జిల్లాలోని పరందూర్ సహా 20 గ్రామాల్లో ప్రైవేటు భూముల సేకరణ, ప్రభుత్వ భూముల బదలాయింపునకు పరిపాలనా అనుమతులు కల్పించారు. ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా, టిడ్కో నిర్వహించిన సాధ్యాసాధ్యాల అధ్యయనాల అనంతరం పన్నూర్, తిరుపోరూర్, పడలం వంటి ఇతర ప్రాంతాల కంటే పరందూర్ అనుకూలమని ఎంపిక చేసినట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారని పిటిషనర్ తన వాదనలో ప్రస్తావించారు. చెన్నై-బెంగళూరు ఎక్స్‌ప్రెస్‌వేకు సమీపంలో ఉండటం, ఇతర ప్రాంతాలతో పోలిస్తే తక్కువ స్థాయిలో జనాభా తరలింపు (సుమారు 1,500 కుటుంబాలు) అవసరం కావడం, విమానయాన కార్యకలాపాలకు అనుకూలత, భవిష్యత్తులో విమానాశ్రయ విస్తరణకు అవకాశాలు ఉండటం వంటి అంశాలు ఈ ప్రాంతం ఎంపికకు కారణాలుగా పేర్కొన్నారు.

ప్రభుత్వం చెబుతున్న కారణాలేమిటి?

2026 ఆగస్టు 24న తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ శాసనసభలోని రూల్ 110 కింద పరందూర్ విమానాశ్రయ ఏర్పాటుకు సంబంధించిన చర్యలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. రైతుల వ్యవసాయ భూములు, గ్రామీణ ప్రజల నివాసాలు, జీవనోపాధిపై తీవ్ర ప్రభావం పడకుండా ప్రత్యామ్నాయ ప్రాంతాన్ని ఎంపిక చేయడమే తమ ప్రభుత్వ ఉద్దేశమని స్పష్టం చేశారు. తాజా విచారణ సందర్భంగా అడ్వకేట్ జనరల్ విజయ్ నారాయణ్ ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్థించారు. ప్రతిపాదిత భూసేకరణ ప్రాంతంలో (మొత్తం 5,368 ఎకరాల్లో సుమారు 201 ఎకరాలు జలవనరులు, చిత్తడి నేలలు) పెద్ద సంఖ్యలో చెరువులు, ఇతర జలవనరులు, వ్యవసాయ భూములు ఉన్నాయని, దీంతో పర్యావరణ అనుమతులు పొందడం కష్టమయ్యే అవకాశముందని కోర్టుకు వివరించారు. ఇది ప్రభుత్వ విధానపరమైన నిర్ణయమని, తప్పుడు నిర్ణయాన్ని సరిదిద్దుకునే అధికారం ప్రభుత్వానికి ఉంటుందని పేర్కొన్నారు. దీనికి సంబంధించిన కారణాలను వివరిస్తూ ప్రభుత్వ ఉత్తర్వు త్వరలో జారీ చేస్తామని, ప్రస్తుతం ఆ ఉత్తర్వు ప్రక్రియలో ఉందని తెలిపారు. మరోవైపు, పరందూర్ ప్రాజెక్టును నిలిపివేసినప్పటికీ చెన్నైకి రెండో విమానాశ్రయం అవసరం లేదని ప్రభుత్వం ప్రకటించలేదు. ప్రత్యామ్నాయ ప్రాంతాలను పరిశీలించడంతో పాటు మీనంబాక్కంలోని ప్రస్తుత విమానాశ్రయంలో టెర్మినల్ విస్తరణ (టెర్మినల్ 3, టెర్మినల్ 5 ద్వారా వార్షిక సామర్థ్యాన్ని 5.5 కోట్ల ప్రయాణికులకు పెంచడం) ద్వారా ప్రయాణికుల రద్దీని నిర్వహించాలనే ప్రణాళికను కూడా ముఖ్యమంత్రి ప్రకటించారు. కాగా, మద్రాస్ హైకోర్టు జారీ చేసిన నోటీసులు ప్రభుత్వ నిర్ణయాన్ని తక్షణమే రద్దు చేసినట్లు కాదు. అలాగే ప్రాజెక్టును తిరిగి ప్రారంభించాలని కూడా ఆదేశించలేదు. సంబంధిత సంస్థల వివరణలు, ప్రభుత్వం సమర్పించే అధికారిక రికార్డులు, పర్యావరణపరమైన అంశాల పరిశీలన అనంతరం ఈ వ్యవహారంలో తదుపరి న్యాయపరమైన స్పష్టత వచ్చే అవకాశం ఉంది.



ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం...

అనంతపురం, నవంబర్ 20, దరువు న్యూస్ : నగరంలో ప్రజా సమస్యల పరిష్కారానికి, ప్రజలకు మరింత చేరువగా ఉండేందుకు తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్సీ దలవాయి రమాదేవి శుక్రవారం ప్రత్యేక కార్యాలయాన్ని ప్రారంభించారు. ప్రజలు తమ సమస్యలు, అభ్యర్థనలు, అవసరాలను నేరుగా తన దృష్టికి తీసుకురావడానికి ఈ కార్యాలయం ఒక వేదికగా నిలుస్తుందని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దలవాయి రమాదేవి మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధిగా ప్రజలకు అందుబాటులో ఉండటం, వారి సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయడం తన బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసమే ఈ కార్యాలయాన్ని ఏర్పాటు చేశామన్నారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి వినతిని పరిశీలించి, సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సామాన్య కుటుంబం నుంచి వచ్చిన తనకు రాజకీయంగా గుర్తింపు ఇచ్చి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్‌లకు





ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ప్రజాసేవలో ముందుంటానని, పదవిని ప్రజలకు సేవ చేసే బాధ్యతగా భావిస్తున్నానని తెలిపారు. అనంతపురం నగర అభివృద్ధి, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్సీ దలవాయి రమాదేవి స్పష్టం చేశారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, టీడీపీ అధ్యక్షుడు పూల నాగరాజు, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులతో సమన్వయం చేసుకుంటూ అనంతపురం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని వెల్లడించారు. ప్రజలు ఎప్పుడైనా కార్యాలయానికి వచ్చి తమ సమస్యలను తెలియజేయవచ్చని, ప్రజలతో మమేకమై వారి అవసరాలకు స్పందించే ప్రజాసేవే తన ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్సీ దలవాయి రమాదేవి పేర్కొన్నారు. అనంతరం 52వ డివిజన్ కార్పొరేటర్ వడ్డే కుమార్, 58వ డివిజన్ వడ్డే నాగరత్న, 10వ డివిజన్ వడ్డే రెడ్డిశ్వరి, 56వ డివిజన్ లక్ష్మీ రెడ్డి, 57వ డివిజన్ మూర్తి, 59 డివిజన్ హర్షవర్ధన్, 60 డివిజన్ ఆదిమ్మలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం ముఖ్య నాయకులు, టీడీపీ నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ సర్పంచ్ అభ్యర్థిగా పుంజాచంద్రకళ నామినేషన్



పామిడి, నవంబర్ 20, దరువు న్యూస్ :

మండలంలోని సొరకాయలపేట గ్రామపంచాయతీ సర్పంచు పదవికి శుక్రవారం ఎద్దులపల్లి గ్రామ సచివాలయం నందు నామినేషన్ దాఖలు చేశారు. కాపు వడ్డే యాదవ కురువ తదితర సామాజిక వర్గానికి చెందిన నాయకులు పెద్దల మద్దతు తెలుపగా వారి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నామినేషన్ దాకులు చేయడమైనది. ఈ కార్యక్రమంలో ఆర్ సి వెంకట్రామిరెడ్డి మాజీ సర్పంచ్‌లు పులికంటి మల్లిరెడ్డి, మూలి నాగేశ్వరరెడ్డి, పుంజా లక్ష్మీనారాయణ, రామిరెడ్డి ప్రతాపరెడ్డి, ఓబుళరాయుడు, తదితర నాయకులు, కార్యకర్తలు పెద్దలు శ్రేణులు పాల్గొన్నారు.

ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కాన్వాయ్‌పై దాడి..

ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు

రాజకీయ కక్షలతో భౌతిక దాడులకు దిగడం అన్యాయం : యువజన విభాగం నాయకులు చల్లా సునీల్ కుమార్

అనంతపురం, నవంబర్ 20, దరువు న్యూస్ :

ప్రజాస్వామ్యంలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగాలి. కోర్టు ఆదేశాల మేరకు వైకాపా మద్దతు కలిగిన సర్పంచ్ అభ్యర్థుల నామినేషన్ల ప్రక్రియలో పాల్గొనేందుకు వెళ్తున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కాన్వాయ్‌పై దాడి జరగడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని కడప జిల్లా వైఎస్ఆర్సీపీ యువజన విభాగం కార్యనిర్వహక సభ్యులు, వైసీపీ నేత చల్లా సునీల్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం సింహాద్రిపురం మండలం అంకాలమ్మగూడూరు సమీపంలో చోటుచేసుకున్న ఈ ఘటనను ఆయన తీవ్రంగా ఖండించారు. పార్టీ అభ్యర్థులకు మద్దతుగా నామినేషన్ల కార్యక్రమానికి వెళ్తున్న ఎంపీ కాన్వాయ్‌ను అడ్డుకుని రాళ్లు, కర్రలు, పెట్రోల్ బాంబులతో దాడి చేసినట్లు ఆరోపించారు. ఈ ఘటనలో ఓ వాహనం ధ్వంసమైనట్లు తెలిపారు. ఎంపీ అవినాష్ రెడ్డి ముందుగానే స్థానిక సీఐ, ఎస్ఐలకు సమాచారం అందించిన కూడా ఇలాంటి దాడులు జరగడం వెనుక పోలీసులు ఉన్నారేమో అనే అనుమానం కూడా వ్యక్తం చేశారు. రాజకీయ ప్రత్యర్థులపై భౌతిక దాడులకు దిగడం, నామినేషన్ల ప్రక్రియకు ఆటంకాలు కలిగించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే హక్కును ప్రతి ఒక్కరికీ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సునీల్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ ప్రభుత్వంలో ఎంపీపై దాడి చెయ్యడానికి కూడా వెనకాడటం లేదు అని, సెక్యూరిటీ ఉన్న వ్యక్తిపై దాడికి కూడా తెగబడుతున్నారని, కూటమి పార్టీ వాళ్ళు ఎన్ని వ్యవస్థలను వాడుకొని విరుచుకుపడినా, ప్రాణాలకు తెగించి అయినా పోరాటం చేసేందుకు మా పార్టీ నాయకులు కార్యకర్తలు సిద్ధంగా ఉన్నామని, ఎంపీపై దాడిని కేంద్రం సీరియస్‌గా తీసుకోవాలన్నారు. ఈదాడి ఘటనపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ, ప్రజాస్వామ్యంలో ఇలాంటి భౌతికదాడులకు తావులేదని స్పష్టం చేశారు. ఈ ఘటనను 'ప్రజాస్వామ్యంపై జరిగిన దాడి'గా అభివర్ణించారు. ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తించిన నిందితులపై తక్షణమే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని చల్లా సునీల్ కుమార్ డిమాండ్ చేశారు.



గ్రంథాలయాలకు పూర్వ వైభవం తీసుకొస్తున్న మంత్రి లోకేష్

59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో ఎమ్మెల్యే దగ్గుపాటి
పుస్తక పఠనంతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు
గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్న ఎమ్మెల్యే





అనంతపురం, నవంబర్ 20, దరువు న్యూస్ :

విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గ్రంథాలయాలకు పూర్వ వైభవం తీసుకొస్తున్నారని.. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. నగరంలోని గ్రంథాలయంలో నిర్వహించిన 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వడ్డే వెంకట్ తో కలిసి ఆయన ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ.. ఒకప్పుడు దినపత్రికలు చదవడం మొదలుకొని, గ్రూప్స్ వంటి పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థుల వరకు అందరూ గ్రంథాలయాలపైనే ఆధారపడేవారని గుర్తుచేశారు. చదువుల తల్లికి నిలయంగా, ఒక దేవాలయం లాంటి పవిత్ర వాతావరణం గ్రంథాలయాల్లో ఉండేదని తెలిపారు. మారిన కాలానికి అనుగుణంగా ప్రస్తుతం సెల్ ఫోన్లు, కంప్యూటర్ల వినియోగం పెరిగిందని, ఇందుకు తగ్గట్టుగా రాష్ట్రంలోని గ్రంథాలయాలకు పూర్వ వైభవం తీసుకువస్తూ వాటిని ఆధునీకరించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. గత టిడిపి ప్రభుత్వంలో అనంతపురం జిల్లా గ్రంథాలయాన్ని ఆర్డిటీ సహకారంతో డిజిటల్ లైబ్రెరీగా రూపుదిద్దుకుందని పేర్కొన్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని ఎమ్మెల్యే ప్రశంసించారు. మంగళగిరిలో 100 కోట్ల భారీ వ్యయంతో దేశానికే ఆదర్శంగా నిలిచేలా ఒక మోడల్ గ్రంథాలయాన్ని మంత్రి లోకేష్ నిర్మిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సన్నబియ్యంతో నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నారని, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరుతో విద్యా కానుక కిట్లను పంపిణీ చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తుండటంతో, ప్రైవేట్ మరియు కార్పొరేట్ విద్యాసంస్థల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లోకి విద్యార్థుల చేరికలు భారీగా పెరిగాయని హర్షం వ్యక్తం చేశారు. అలాగే, విద్యార్థులు చదువుకునే సమయంలోనే స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ల ద్వారా నైపుణ్యాలను నేర్పించి, వారు సులభంగా ఉద్యోగాలు సాధించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వివరించారు.

గ్రంథాలయాలు విజ్ఞానానికి నిలయాలని, భావి భారత పౌరులైన విద్యార్థులు పుస్తక పఠనం ద్వారా విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. అనంతరం వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఎమ్మెల్యే, ఎంపీ చేతుల మీదుగా సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ అధికారులు, సిబ్బంది, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నన్ను హత్య చేయడానికే..

నా ఇంటిపై దాడి చేయించారు



అనంతపురం, నవంబర్ 20, దరువు న్యూస్ :

తాడిపత్రి పట్టణంలో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలు, వాహనాల దగ్ధంపై మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తీవ్రంగా స్పందించారు. తనను అంతమొందించే కుట్రతోనే జేసీ ప్రభాకర్ రెడ్డి తన ఇంటిపైకి అనుచరులను పంపి దాడి చేయించారని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. తాడిపత్రి రణరంగంగా మారిన నేపథ్యంలో మీడియాతో మాట్లాడిన కేతిరెడ్డి పెద్దారెడ్డి, తన నివాసంపై జరిగిన దాడి వెనుక పక్కా పథకం ఉందని మండిపడ్డారు. పట్టణంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తూ, ఏకంగా తన ప్రాణాలకే హాని తలపెట్టే ఉద్దేశంతో ఈ దాడికి పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనలో తన నివాసం వద్ద ఉన్న వాహనాలకు నిప్పు పెట్టడంతో అవి పూర్తిగా కాలిబూడిదయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలో ఇంతటి విధ్వంసం జరుగుతున్నా, తన ఇంటిపైకి దాడికి తెగబడుతున్నా పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారని పెద్దారెడ్డి విమర్శించారు. ఈ హత్యాయత్నం, విధ్వంసంపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, దాడికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కేతిరెడ్డి చేసిన ఈ వ్యాఖ్యలతో తాడిపత్రి రాజకీయాల్లో ఒక్కసారిగా వేడి మరింత రాజుకుంది.

హెరిటేజ్ పార్లర్‌ను సందర్శించిన నారా బ్రాహ్మణి



నల్లచెరువు, నవంబర్ 20, దరువు న్యూస్ :

మండల కేంద్రంలోని హెరిటేజ్ పార్లర్‌ను పరిశీలించేందుకు శుక్రవారం రాష్ట్ర మంత్రి నారా లోకేష్ సతీమణి నారా బ్రాహ్మణి సందర్శించారు. ఈ సందర్భంగా పార్లర్ యజమాని వాదులపల్లి రియాజ్ కుటుంబ సభ్యులు ఆమెకు స్వాగతం పలికారు. అనంతరం తెలుగుదేశం పార్టీ మండల సీనియర్ నాయకులు వాదులపల్లి అబ్దుల్ ఖాదర్, నాగభూషణ్ నాయుడు నారా బ్రాహ్మణిని మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడారు. పార్లర్ నిర్వహణ, వ్యాపార కార్యకలాపాలను ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జనగణనకు పకడ్బందీ ప్రణాళిక.. క్షేత్రస్థాయిలో పక్కాగా అమలు

రెండో దశ నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావుండకూడదు : కలెక్టర్ శ్యామ్ ప్రసాద్
జనవరి 10 నుంచి స్వీయ గణన.. జనవరి 25 నుంచి ఇంటింటి సర్వే

పుట్టపర్తి, నవంబర్ 20, దరువు న్యూస్ :

దేశ భవిష్యత్ ప్రణాళికలకు కీలకమైన జనగణన ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సన్నద్ధమవుతోంది. ఇందులో భాగంగా శ్రీ సత్యసాయి జిల్లా పరిధిలో చేపట్టనున్న జనగణన రెండో దశ నిర్వహణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి తప్పిదాలకు అవకాశం లేకుండా వివిధవిధానాలపై పూర్తి అవగాహన కల్పించేందుకు శుక్రవారం పుట్టపర్తిలోని సాంస్కృతిక కళాశాలలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ సమక్షంలో, జిల్లా జనగణన నోడల్ అధికారి సూర్యపర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, సాంకేతిక సహాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జనగణన ద్వారా సేకరించే గణాంకాలు దేశ అభివృద్ధి, సంక్షేమ పథకాల రూపకల్పన, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేసేందుకు ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో క్షేత్రస్థాయి అధికారుల బాధ్యత అత్యంత కీలకమని, శిక్షణ పొందిన అధికారులు తమ పరిధిలోని పర్యవేక్షకులు, గణనకారులకు నాణ్యమైన శిక్షణ అందించాలని సూచించారు. జనగణనకు సంబంధించిన మార్గదర్శకాలు, విధి విధానాలను ప్రతి ఒక్కరూ క్షుణ్ణంగా తెలుసుకోవాలని, ప్రజల నుంచి సేకరించే వివరాల్లో ఎలాంటి పొరపాట్లు లేకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. జనగణన రెండో దశలో భాగంగా జనవరి 10 నుంచి 24వ తేదీ వరకు స్వీయ గణనకు అవకాశం కల్పించనున్నారు. ఈ సమయంలో ప్రజలు ఆన్‌లైన్ ద్వారా తమ కుటుంబ వివరాలను స్వయంగా నమోదు చేసుకోవచ్చు. అనంతరం జనవరి 25 నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు 35 రోజులపాటు క్షేత్రస్థాయిలో ఇంటింటి గణన నిర్వహిస్తారు. నియమిత గణనకారులు ప్రతి ఇంటిని సందర్శించి కుటుంబ సభ్యులకు సంబంధించిన వివరాలను సేకరిస్తారు. మార్చి 1 నుంచి 5వ తేదీ వరకు ఐదు రోజుల పాటు పునఃపరిశీలన చేపట్టి, నమోదు కాకుండా మిగిలిన వివరాలు, అవసరమైన మార్పులు, చేర్పులను సరిచేస్తారు. శిక్షణ పొందిన క్షేత్రస్థాయి శిక్షకులు తదుపరి గణనకారులకు శిక్షణ అందించనుండగా, పర్యవేక్షకులు గణన ప్రక్రియను నిరంతరం పరిశీలిస్తూ అవసరమైన సూచనలు చేస్తారు. ప్రతి ఇంటి వివరాలు సక్రమంగా నమోదు కావడం, సమాచారం వాస్తవికంగా ఉండటం, నిర్దిష్ట గడువులో ప్రక్రియ పూర్తవడం లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లా జనగణన నోడల్ అధికారి సూర్యపర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. జనగణనలో సేకరించే సమాచారం ఖచ్చితమైనదిగా, విశ్వసనీయమైనదిగా ఉండేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. జాతీయ ప్రాధాన్యత కలిగిన ఈ కార్యక్రమం విజయవంతం కావాలంటే ప్రజల సహకారం కూడా ఎంతో అవసరమని పేర్కొన్నారు. తమ ఇళ్లకు వచ్చే గణనకారులకు సరైన వివరాలు అందించి జనగణన ప్రక్రియ సజావుగా సాగేందుకు జిల్లా ప్రజలందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



ఓటు హక్కు ప్రాధాన్యత తెలియాలి

అనంతపురం, నవంబర్ 20, దరువు న్యూస్ :



ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతంలో యువత భాగస్వామ్యం అత్యంత కీలక మని, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటరుగా నమోదు చేసుకుని, తమ ఓటు హక్కును సద్వినియోగం చేసు కోవాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్ పిలుపు నిచ్చారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎలక్టోరల్ లిటరసీ క్లబ్స్ (ఈఎల్‌సి) ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన పోటీల విజేతలకు ఆయన ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. పాఠశాల, కళాశాల స్థాయి నుండే ఓటు హక్కు ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడం ఎంతో అవసరమన్నారు. ప్రస్తుతం 8వ తరగతి నుండి డిగ్రీ చదువుతున్న విద్యార్థులలో 18 ఏళ్లు నిండిన వారు ఇప్పటికే ఓటర్లుగా నమోదయ్యారని, మిగిలిన వారు రాబోయే 3 నుండి 5 ఏళ్లలో ఓటు హక్కు పొందనున్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో ఎటువంటి డబ్బులు, ప్రలోభాలు, ద్వేషాలకు లోనుకాకుండా దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించగల సమర్థులైన నాయకులను ఎన్నుకోవాలని సూచించారు. పోటీలలో పాల్గొన్న విద్యార్థులు తమ తోటి స్నేహితులకు, సమాజానికి ఓటు ఆవశ్యకతను వివరించాలని, మరింత మంది విద్యార్థులు ఈఎల్‌సీ క్లబ్‌లలో సభ్యులుగా చేరాలని ఆకాంక్షించారు.

పల్లె పోరుకు పోలీసు పహారా..

నామినేషన్లపై నిఘా నేత్రం!

మూడో విడత పంచాయతీ ఎన్నికలకు ఖాకీల ముందస్తు కసరత్తు
13 మండలాల్లో పటిష్ట భద్రత.. సమస్యాత్మక గ్రామాలపై డ్రోన్లు, సీసీ కెమెరాలతో నిఘా



పుట్టపర్తి, నవంబర్ 20, దరువు న్యూస్ :

గ్రామ పంచాయతీ ఎన్నికల మూడో విడతకు రంగం సిద్ధమవుతున్న వేళ పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. నామినేషన్ల దశ నుంచే ఎలాంటి అవాంఛనీయ పరిణామాలకు తావులేకుండా భద్రతా వలయాన్ని పటిష్టం చేస్తోంది. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా సాగడంతో పాటు అభ్యర్థులు, ఓటర్లు స్వేచ్ఛగా తమ హక్కులను వినియోగించుకునేలా జిల్లా పోలీసు శాఖ ముందస్తు చర్యలకు శ్రీకారం చుట్టింది. ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ, డిసెంబర్ 2న పోలింగ్, అదే రోజు ఓట్ల లెక్కింపు జరగనున్న నేపథ్యంలో ప్రత్యేక భద్రతా ప్రణాళికను సిద్ధం చేసినట్లు జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ ఐపీఎస్ తెలిపారు. ఇప్పటికే మొదటి, రెండో విడత ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని, మూడో విడతలోనూ అదే తరహాలో ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు పోలీసు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. జిల్లాలోని చిలమత్తూరు, గోరంట్ల, హిందూపురం, లేపాక్షి, పరిగి, పెనుకొండ, రొద్దం, సోమందేపల్లి, అగళి, అమరాపురం, గుడిబండ, మడకశిర, రొల్ల మండలాల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఆయా మండలాల్లోని నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని, కేంద్రాల 100 మీటర్ల పరిధిలో ఎన్నికల నియమావళిని కచ్చితంగా అమలు చేయాలని ఎస్పీ స్పష్టం చేశారు. ముఖ్యంగా సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక గ్రామాలను ముందుగానే గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో డ్రోన్లు, సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ చేపట్టి పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆదేశించారు.

ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. గ్రామాల్లో ఎన్నికల సందడి మొదలవుతున్న నేపథ్యంలో పోలీసు శాఖ అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. నామినేషన్ల స్వీకరణ నుంచి పోలింగ్, ఓట్ల లెక్కింపు వరకు ప్రతి దశలోనూ భద్రతా చర్యలు కొనసాగుతాయని, ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునే వాతావరణం కల్పించడమే లక్ష్యమని ఎస్పీ పేర్కొన్నారు.



జిల్లా చరిత్రలో నవశకం

శ్రీ సత్యసాయి జిల్లా తొలి జడ్పీ పీఠంపై మొదలైన పరిటాల శకం ▸▸ జిల్లా ప్రజా పరిషత్ ప్రథమ చైర్మన్‌గా పరిటాల శ్రీరామ్ ప్రమాణ స్వీకారం ▸▸ వెంకటాపురంలో పరిటాల ఘాట్ వద్ద భావోద్వేగ నివాళులు ▸▸ కలెక్టర్ అధ్యక్షతన, జిల్లా నాయకుల సమక్షంలో, అభిమానుల ఆశీస్సులతో అట్టహాసంగా ప్రమాణ స్వీకారం ▸▸ వైస్ చైర్మన్‌గా జనసేన నేత సునేత్ర ప్రమాణం ▸▸ తండ్రి రవి ఆశయాలు, తల్లి సునీతమ్మ స్ఫూర్తితో పని చేస్తా.. పరిటాల శ్రీరామ్ ▸▸ జిల్లాను అభివృద్ధి పథంలో నిడిపిస్తా ▸▸ ఏ జడ్పీ పీఠం కోసం నా భర్త ప్రాణాలు కోల్పోయారో, నేడు అదే పీఠంపై నా కుమారుడు వచ్చాడు.. పరిటాల సునీత ▸▸ అభివృద్ధే మా వజ్రాయుధం.. మంత్రి సవిత ▸▸ ఎడారిలో ఒయాసిస్ లాంటి విజయం ఇది.. ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్



సత్యసాయి జిల్లా, నవంబర్ 20, దరువు బ్యూరో :

శ్రీసత్యసాయి పుట్టపర్తి జిల్లా రాజకీయ చరిత్రలో ఒక సువర్ణాధ్యాయం ఆవిష్కృతమైంది. నూతన జిల్లా ఏర్పడిన తర్వాత మొట్టమొదటి జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ పీఠాన్ని దివంగత నేత పరిటాల రవీంద్ర వారసుడు, ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ అధిరోహించడంతో జిల్లాలో సరికొత్త పరిటాల శకం ప్రారంభమైంది. కూటమి పొత్తు ధర్మానికి అనుగుణంగా జనసేన పార్టీకి చెందిన గోరంట్ల జడ్పీటీసీ సునేత్ర వైస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం ఉదయం రామగిరి మండలం వెంకటాపురంలోని తన నివాసంలో కుటుంబ సభ్యులతో కలిసి పరిటాల శ్రీరామ్ ప్రత్యేక పూజలు నిర్వహించడంతో ఈ చారిత్రక ఘట్టానికి శ్రీకారం చుట్టారు. అనంతరం తన తండ్రి, కీర్తిశేషులు పరిటాల రవీంద్ర ఘాట్ వద్దకు చేరుకుని భావోద్వేగంగా నివాళులర్పించి ఆశీస్సులు తీసుకున్నారు. తదుపరి తమ ఇలవేల్పు శ్రీ యల్లమ్మ అమ్మవారి ఆలయంలో 201 కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. అక్కడి నుంచి వందలాది వాహనాలు, వేలాది మంది టీడీపీ కార్యకర్తలు, అభిమానుల కోలాహలం మధ్య పుట్టపర్తికి బయలుదేరారు. మార్గమధ్యంలో అడుగడుగునా కార్యకర్తలు పూలవర్షం కురిపిస్తూ ఘనస్వాగతం పలికారు.

టీడీపీ కార్యాలయంలో నేతల భేటీ..

రెవెన్యూ భవన్‌లో ప్రమాణ స్వీకారం

ముందుగా పుట్టపర్తిలోని జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి చేరుకున్న శ్రీరామ్.. జిల్లా ఎన్నికల పరిశీలకులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, జిల్లా టీడీపీ అధ్యక్షుడు ఎంఎస్ రాజు, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, హిందూపురం ఎంపీ బి.కె. పార్థసారథి, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, కందికుంట వెంకట ప్రసాద్, పల్లె సింధూర రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి, కూటమి జడ్పీటీసీ సభ్యులతో సమావేశమయ్యారు. అనంతరం నేతలందరూ కలిసి మామిళ్ళకుంట క్రాస్‌లోని రెవెన్యూ భవన్‌కు చేరుకున్నారు. అక్కడ జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ ఆధ్వర్యంలో, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, శ్రేయోభిలాషుల సమక్షంలో నల్లచెరువు జడ్పీటీసీ సభ్యునిగా, శ్రీ సత్యసాయి పుట్టపర్తి జిల్లా ప్రథమ జడ్పీ చైర్మన్‌గా పరిటాల శ్రీరామ్ పదవీ స్వీకార ప్రమాణం చేశారు.

నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటా..

జడ్పీ చైర్మన్ పరిటాల శ్రీరామ్

రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో యువతకు పెద్దపీట వేస్తూ, కొత్త రక్తం మరియు కొత్త ఆలోచనలు పరిపాలనలోకి రావాలని యువనేత నారా లోకేష్ బలంగా నమ్మారని ఈ సందర్భంగా పరిటాల శ్రీరామ్ అన్నారు. ఆ నమ్మకంతోనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నాకు తొలి జడ్పీ చైర్మన్‌గా ఈ అద్భుతమైన అవకాశాన్ని కల్పించారన్నారు. గతంలో జిల్లాకు, పార్టీకి ఏ కష్టం వచ్చినా పరిటాల కుటుంబం ముందుండి అండగా నిలబడిందని, నా తండ్రి పరిటాల రవి పార్టీని, సామాన్యులను నిలబెట్టడానికి కృషి చేశారన్నారు. మా అమ్మ పరిటాల సునీతమ్మ ఏ విధంగా పనిచేశారో.. వారి పేరు నిలబెడుతూ అంతకంటే గొప్పగా పనిచేస్తానన్నారు. జిల్లాలోని మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలందరి సమన్వయంతో గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపిస్తాను. పార్టీ నాపై పెట్టిన బాధ్యతను, పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా పని చేస్తానని శ్రీరామ్ అన్నారు.

నా భర్త ఆశయం నెరవేరింది.. ఇది దైవ నిర్ణయం.. ఎమ్మెల్యే పరిటాల సునీత

రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. నాడు పరిటాల రవి బి.కె.పార్థసారథిని, నేను చమన్‌ను జడ్పీ చైర్మన్లుగా చేశామన్నారు. ఏ జడ్పీ చైర్మన్ పదవి కోసం అయితే పరిటాల రవి ప్రాణాలు పోగొట్టుకున్నారో, నేడు జిల్లా నేతలందరి సహకారంతో అదే చైర్మన్ పీఠంపై మా కుమారుడు శ్రీరామ్ కూర్చోవడం ఒక అదృష్టంగా, దైవ నిర్ణయంగా భావిస్తున్నానన్నారు. ఏ లోకాన ఉన్నా రవి ఎంతో సంతోషిస్తారన్నారు. తెలుగు రాష్ట్రాల్లోని పరిటాల అభిమానులు, టీడీపీ కుటుంబ సభ్యులందరికీ ఇది పండగరోజు అన్నారు. రాబోయే పంచాయతీ ఎన్నికల్లోనూ కూటమి క్లీన్ స్వీప్ చేయడం ఖాయమని చెప్పారు.

ఎడారిలో ఒయాసిస్ లాంటి విజయం ఇది..

ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్

కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ మాట్లాడుతూ.. 'ఆకలైనప్పుడు అన్నం పెట్టమంటే పరమాన్నం పెట్టినంత సంతోషంగా ఉందని అన్నారు. పరిటాల కుటుంబానికి నాకు దశాబ్దాల సాన్నిహిత్యం ఉందన్నారు. అందుకే శ్రీరామ్‌ను బాధ్యతగా ఆహ్వానించి మా కదిరి నియోజకవర్గంలోని నల్లచెరువు నుంచి పోటీ చేయించామన్నారు. కదిరి ప్రజలు, కూటమి కార్యకర్తలు శ్రీరామ్‌ను తమ బిడ్డలా గుండెల్లో పెట్టుకుని ఆశీర్వదించి భారీ మెజారిటీతో గెలిపించారన్నారు. ఒకవైపు మా నియోజకవర్గ ప్రతినిధిగా గెలిపించుకోవడం, మరోవైపు నూతనంగా ఏర్పడిన సత్యసాయి జిల్లాకు ప్రథమ పౌరుడిగా నిలబెట్టుకోవడం ఒక డబుల్ బొనాంజా అన్నారు. గత ఏడెనిమిది ఏళ్లుగా ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్న యువకుడు శ్రీరామ్‌కు ఈ పదవి రావడం, ఎడారిలో ఒయాసిస్ మాదిరిగా కార్యకర్తలందరినీ సేదతీర్చిందన్నారు..

అభివృద్ధే మా వజ్రాయుధం.. మంత్రి సవిత

రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత మాట్లాడుతూ.. కూటమి ధర్మాన్ని పాటిస్తూ టీడీపీకి చైర్మన్, జనసేనకు వైస్ చైర్మన్ పదవులు కేటాయించామని మంత్రి సవిత అన్నారు. జిల్లాలో ఫైటర్ జెట్ పరిశ్రమ, కియా సెకండ్ ఎక్స్‌పాన్షన్ ప్లాంట్, సాగునీటి ప్రాజెక్టులతో అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. అభివృద్ధే మా వజ్రాయుధం అని.. పరిటాల వారసుడిగా శ్రీరామ్ సారథ్యంలో జిల్లా మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. శ్రీరామ్ జడ్పీ చైర్మన్ కావడం తనకు ఎంతో సంతోషాన్నిచ్చిందన్నారు.

ధర్మవరంలో అంబరాన్నంటిన విజయోత్సవ సంబరాలు

ప్రమాణ స్వీకార కార్యక్రమం ముగిసిన అనంతరం సాయంత్రం ధర్మవరం పట్టణానికి చేరుకున్న పరిటాల శ్రీరామ్‌కు అపూర్వ స్వాగతం లభించింది. ఎర్రగుంట సర్కిల్ వద్దకు భారీగా తరలివచ్చిన వేలాది మంది కార్యకర్తలు, అభిమానులకు అభివాదం చేస్తూ శ్రీరామ్ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. అనంతరం ఎర్రగుంట సర్కిల్ నుంచి కదిరి గేట్ వరకు నిర్వహించిన భారీ విజయోత్సవ ర్యాలీతో ధర్మవరం పట్టణం పసుపుమయమైంది. ధర్మవరం పట్టణం మొత్తం పరిటాల నినాదంతో దద్దరిల్లింది.







ఉచిత కంప్యూటర్ శిక్షణకు ధరఖాస్తులు ఆహ్వానం

అనంతపురం, నవంబర్ 20, దరువు న్యూస్ :

కంప్యూటర్ ఉద్యోగాల కోసం ప్రతి ఒక్కరికీ ఉపయోగపడేటట్లు ఉచిత కంప్యూటర్ శిక్షణ నిర్వహిస్తున్నట్లు సాయి ఇన్‌స్టూట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఎడ్యుకేషనల్ సొసైటీ సంస్థ ప్రతినిధులు యర్రగుంట ఓబిరెడ్డి, యర్రగుంట గజలక్ష్మిలు ఓ ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ కంప్యూటర్ శిక్షణలో ఎంఎస్ ఆఫీస్, ఫోటో షాప్, ట్యాలీ, ఆటోక్యాడ్, సి-ల్యాంగ్వేజ్, జావా, పైతాన్, స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కంప్యూటర్ శిక్షణ ఈనెల 25వ తేదీ నుండి 60 రోజుల పాటు ఉంటుందని, మొదటి బ్యాచ్ ఉదయం 7గంటల నుండి 9 గంటల వరకు ఉంటుంది. అలాగే రెండవ బ్యాచ్ 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు ఉంటుంది. మూడవ బ్యాచ్ మధ్యాహ్నం 3 గంటల నుండి 5గంటల వరకు ఉంటుంది. నాల్గవ బ్యాచ్ సాయంత్రం 5 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని 10వ తరగతి నుండి పీజీ చదువుకున్న యువత, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలలో ఉద్యోగాల చేస్తున్న వారు కూడా ఈ ఉచిత కంప్యూటర్ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు సాయి ఇన్‌స్టూట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఎడ్యుకేషనల్ సొసైటీ సంస్థ కార్యాలయం పీఎల్ఎన్ బిల్డింగ్, శ్రీనివాస న్యూరో హాస్పిటల్, కమలనగర్, సెల్ నెం. 9059723829, 7569033379 నెంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

నామినేషన్ దాఖలు చేసిన మేకల కృష్ణవేణి



పామిడి, నవంబర్ 20, దరువు న్యూస్ :

పామిడి పట్టణంలో పంచాయతీ ఎన్నికల్లో జరుగుతున్నందున కూటమి పార్టీ తరఫున అన్ని రకాల ఆలోచన చేసి యువ నాయకుడు గుమ్ములూరు జయరాం, ఇన్‌చార్జ్ ఈశ్వర్ కూటమి ప్రభుత్వాన్ని అన్ని విధాల ఆదరిస్తూ ఉన్నందున మరోసారి కుటుంబ ప్రభుత్వానికి పెద్ద పీట వేశారు. అందులో భాగంగానే పామిడి పట్టణం 19వ వార్డు జనసేన పార్టీ తరఫున మేకల కృష్ణవేణి నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం జనసేన పార్టీ నాయకులు కూటమి నాయకులు మాట్లాడుతూ.. గుంతకల్లు నియోజకవర్గం పామిడి పట్టణంలో గతంలో ఎన్నడూ లేని విధంగా పనిచేసిన వారికి కచ్చితంగా న్యాయం జరుగుతుందని ఉద్దేశంతోనే జనసేన పార్టీని గుర్తించి టికెట్ కేటాయించారు. ఏది ఏమైనా పామిడి పట్టణంలో జనసేన పార్టీ అభ్యర్థులకు రావడం గుమ్మనూరు ఈశ్వర్, జనసేన పార్టీ ఇన్‌చార్జ్ మణికంఠ వీరి కృషితో అందరికీ న్యాయం జరిగిందని హర్ష వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కన్వీనర్ బి.మోహన్ కృష్ణ, బూత్ ఇన్‌చార్జ్ రాజు, జనసేన పార్టీ నాయకులు వడ్డే రాము, కత్రిమల సుబ్బు, షేక్షావలి, జమీర్, ఖాజా, కూటమి నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





చందకచర్ల సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకుంటే.. గ్రామాల అభివృద్ధికి రూ.1.50 కోటి తన స్వంత నిధులు కేటాయిస్తా

అన్ని రాజకీయ పార్టీల అధ్యక్షులు నాయకులకు వినతి ▸ భూమానంద ఆశ్రమం పీఠాధిపతి చందకచర్ల ధనుంజయ స్వామి

మడకశిర, నవంబర్ 20, దరువు న్యూస్ :

చందకచర్ల గ్రామ పంచాయతీ సర్పంచుగా నన్ను ఏకగ్రీవంగా ఎన్నుకుంటే గ్రామాల అభివృద్ధికి తన వంతు బాధ్యతగా రూ.1.50 కోటి తన సొంతం డబ్బులు కేటాయిస్తానని భూమానంద ఆశ్రమం పీఠాధిపతి, ప్రముఖ వాస్తు పండిత్ చందకచర్ల డాక్టర్ ధనుంజయ స్వామి స్పష్టం చేశారు. మడకశిర పట్టణ సమీపంలోని ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ పాలిటెక్నీక్ యూనివర్సిటీ వద్దగల భూమనంద ఆశ్రమంలో శుక్రవారం ఏర్పాటు చేసిన పత్రిక మీడియా సమావేశంలో ధనుంజయ స్వామి మాట్లాడుతూ.. తన స్వగ్రామమైన చందకచర్ల గ్రామ పంచాయతీకి చెందిన అన్నివర్గాల ప్రజలు ఆశ్రమంకు విచ్చేసి పంచాయతీ గ్రామాల అన్నివిధాలా అభివృద్ధికి ఈ ఎన్నికల్లో సర్పంచు అభ్యర్థిగా పోటీ చేయాలని, అన్నివిధాలుగా అభివృద్ధి మీ వల్లే సాధ్యమవు తుందని చందక చర్ల పంచాయతీ గ్రామాల ప్రజల విజ్ఞప్తిని తాను కాదనలేక ఈ ఎన్నికల్లో నన్ను సర్పంచ్‌గా రాజకీయ పార్టీలకు అతీతంగా ఏకగ్రీవంగా ఎన్నుకుంటే చందక చర్ల గ్రామ పంచాయతీ గ్రామాల అన్నివిధాలా అభివృద్ధికి తన వంతు బాధ్యతగా పాటుపడుతానని నా పంచాయతీ ప్రజలకు మాటఇవ్వడం జరిగిందని స్వామీజీ తెలిపారు. నన్ను చందకచర్ల సర్పంచుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్న మరు క్షణమే పంచాయతి అభివృద్ధికి తొలి విడతగా రూ.50 లక్షలు తన సొంతం నిధులు కేటాయిస్తానని, అదేవిదంగా రెండు సంవత్సరాలు లోపల తనదైన శైలిలో విరాళాలు, తదితర విధాలుగా రూ.1కోటి నిధులతో గ్రామాల అభివృద్ధికి పాటు పడుతానన్నారు. అంతే కాక తనకున్న వాస్తు పండిత్ ద్వారా ప్రయోజనం పొందిన ఎందరో పారిశ్రామిక వేత్తలు, సమాజ సేవకులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మంత్రులు, ఆర్థిక పరంగా బలంగా ఉన్న నా శిష్యులు తదితరుల ద్వారా నిధులు సేకరించి చందకచర్ల గ్రామ పంచాయతిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, ఉమ్మడి అనంతపురం జిల్లాల్లోనే ఎక్కడ కూడా లేని విదంగా ఆదర్శ గ్రామ పంచాయతీగా తీర్చుదిద్దుతానని స్వామీజీ ఈ సందర్భంగా భరోసానిచ్చారు. కావున కాంగ్రెస్ పార్టీ ప్రముఖ నాయకులు డాక్టర్ ఎన్.రఘువీరారెడ్డి, శ్రీ సత్యసాయి జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి, మంత్రి సవితమ్మ, వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్, జనసేన, బీజేపీ జిల్లా అధ్యక్షులను అన్ని పార్టీల నాయకులను మర్యాదపూర్వకంగా కలసి ఇదే విషయమై విజ్ఞప్తి చేసుకుంటానని ధనుంజయ స్వామి తెలిపారు. ఏది ఏమైనను అన్ని రాజకీయ పార్టీలకు చెందిన అధ్యక్షులు, నాయకులు చందకచర్ల గ్రామ పంచాయతీ అన్నివర్గాల ప్రజలు కలసి నన్ను తాను జన్మించిన చందకచర్ల సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకుని నాకు జన్మనిచ్చిన చందకచర్ల పంచాయతీని అన్నివిధాలుగా అభివృద్ధి చేసేందుకు, ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దేశీదుకు ఒక్క అవకాశం కల్పించాల్సిందిగా చందకచర్ల పంచాయతీలోని 6 గ్రామాల ప్రజలు, అన్ని రాజకీయ పార్టీలకు చెందిన పెద్దలు, నాయకులు ఆదరించి ఒక్క అవకాశం కల్పించాల్సిందిగా చందకచర్ల ధనుంజయ స్వామి కోరారు.



అనంత ఎన్నికల్లో మీ దౌర్జన్యాలు అంతా చూశారు

ఎమ్మెల్యే దగ్గుపాటి తనకు తాను సర్టిఫికెట్ లు ఇచ్చుకోవడం హాస్యాస్పదం : మాజీ మేయర్ మహమ్మద్ వసీం



అనంతపురం, నవంబర్ 20, దరువు న్యూస్ :

అనంతపురం నగర పాలక సంస్థ ఎన్నికలు ప్రజాస్వామ్య బద్ధంగా జరిగాయని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ చెప్పడం హాస్యాస్పదంగా ఉందని మాజీ మేయర్ మహమ్మద్ వసీం అనంతపురం జిల్లాలో కళ్యాణదుర్గం, గుంతకల్లు, తాడిపత్రి, పలు ప్రాంతాలలో ఏకపక్షంగా ఎన్నికలు జరిగిన తీరు రాష్ట్ర ప్రజలు చూశారని, ఎమ్మెల్యే దగ్గుపాటి తనకుతాను సర్టిఫికేట్ తెచ్చుకుంటే ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. గత రెండున్నరేళ్లుగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ వైసీపీని గొడ్డలి పార్టీ అంటూ అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. టీడీపీనే వెన్నుపోటు పార్టీ అని ఎన్‌టీఆర్ నుండి చంద్రబాబు నాయుడు వెన్నుపోటు పొడిచి ఏ విధంగా పార్టీని లాక్కున్నారో.. దగ్గుపాటి ప్రసాద్ చరిత్ర తెలుసుకుని మాట్లాడితే బాగుంటుందన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అసత్య ప్రచారాలు మానుకోవాలని ఆయన సూచించారు. విలేకరులు సమావేశంలో మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షులు సైపుల్లాభేగ్, మాజీ కార్పోరేటర్ ఇషాక్ తదితరులు పాల్గొన్నారు.

Editor, Prblished and Owned by YENUMULA KULLAYAPPA, Published for D.No. 5-76, Bhanukota, Sri Satya Sai - 515621, Printed from Jai Sriram Publications D.No. 1-3-241, Rangaswamy nagar, Ananthapuramu 515001, EDITOR : YENUMULA KULLAYAPPA Mobile : 94940 39030.